


• రెంజల్‌లో డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న జేడీఏ వాజిద్ హుస్సేన్

- జిల్లా వ్యాప్తంగా పంటల వాస్తవ పరిస్థితిని లెక్కకడుతున్న వ్యవసాయ శాఖ
- భూముల సర్వే నెంబర్ల ఆధారంగా డిజిటల్ సర్వే కొనసాగింపు
- మార్చి చివరి వారంలో పంటల లెక్కలను తేల్చనున్న అధికారులు
- జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద 2లక్షల ఎకరాలకు పైగా డిజిటల్ సర్వే

కొనసాగుతున్న డిజిటల్ సర్వే

నిజామాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో యాసంగి పంటల సాగు విస్తీర్ణం తేల్చేందుకు డిజిటల్ సర్వే కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల పరిధిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. జిల్లాలోని 107 క్లస్టర్లలో వ్యవసాయ శాఖ ఏఈవోలు, ఏవోలకు బాధ్యతలను అప్పచెప్పి ఈ సర్వేను కొనసాగిస్తున్నారు. సర్వే నెంబర్ ఆధారంగా క్రాప్ బుకింగ్ పేరు మీద డిజిటల్ సర్వేను కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో ఎంత విస్తీర్ణంలో పంట సాగు చేశారో ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో 2లక్షల ఎకరాలకు పైగా డిజిటల్ సర్వేను చేస్తుండగా మిగతా విస్తీర్ణంలో క్రాప్ బుకింగ్ కొనసాగిస్తున్నారు. వ్యవసాయ అధికారులు పంట చేనుల వద్దకు వెళ్లి ఈ డిజిటల్ సర్వేను చేస్తున్నారు. వేసిన పంట సంబంధించిన చాయాచిత్రాలను తీస్తూ నమోదు కొనసాగిస్తున్నారు. మార్చి నెలాఖరులోపు జిల్లాలో ఎంత మొత్తంలో పంట వేశారో ప్రకటించే విధంగా ఈ సర్వేను కొనసాగిస్తున్నారు.

రెండు లక్షల 8వేల 720 ఎకరాల్లో సర్వే

జిల్లాలోని రెండు లక్షల 8వేల 720 ఎకరాల్లో ఈ సర్వేను కొనసాగిస్తున్నారు. మిగతా పంట వేసిన భూముల్లో క్రాప్ బుకింగ్‌ను చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 107 క్లస్టర్లుగా విభజించారు. ప్రతీ క్లస్టర్ పరిధిలో కొన్ని గ్రామాల్లో ఈ డిజిటల్ సర్వేను కొనసాగిస్తున్నారు. ఆయా క్లస్టర్ల పరిధిలో పనిచేస్తున్న ఏఈవోలకు ఈ బాధ్యతలను అప్పచెప్పారు. ఈ డిజిటల్ సర్వేను ఏవోలు పర్యవేక్షిస్తుండగా ఏఈవోలు కొనసాగిస్తున్నారు. ప్రతీ క్లస్టర్ల పరిధిలో ఒక్కొక్క ఏఈవోకు 1800ల నుంచి 2వేల ఎకరాల వరకు భూములను కేటాయించారు. తమకు కేటాయించిన విస్తీర్ణం సంబంధించిన సర్వే నెంబర్లను కూడా వారికి ఇచ్చారు. ప్రతీరోజు కొన్ని సర్వే నెంబర్ల ఆధారంగా వ్యవసాయ శాఖ ఇచ్చిన ప్రత్యేక యాప్‌లో ట్యాబ్‌ల ద్వారా ఈ వివరాలను ఎంట్రీ చేస్తున్నారు. జిల్లాలో వారం రోజుల క్రితం ఈ సర్వే చేపట్టగా ఇప్పటికే 60వేల ఎకరాల్లో సర్వేను పూర్తి చేశారు. తమకు కేటాయించిన గ్రామాల పరిధిలో పంట చేనుల వరకు ఏఈవోలు వెళ్లి పంటలకు సంబంధించిన ఫొటోలను మొదట అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ తర్వాత సర్వే నెంబర్ ఆధారంగా ఎంత విస్తీర్ణంలో పంట వేశారో యాప్‌లో ఎంట్రీ చేస్తున్నారు. సర్వే నెంబర్‌లో విస్తీర్ణం ఎక్కువగా ఉన్న యాప్ ద్వారా గూగుల్ సర్వే మ్యాప్ ఉండటం వల్ల వాస్తవ విస్తీర్ణాన్ని నమోదు చేస్తున్నారు. మార్చి మూడో వారంలోపు ఈ డిజిటల్ సర్వేను పూర్తి చేసే విధంగా జిల్లాలో కొనసా గిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం 5లక్షల 45వేల ఎకరాల్లో పంటలు వేశారు. ఈ డిజిటల్ సర్వేలో 2 లక్షల 8వేల 720 ఎకరాల్లో చేపట్టగా మిగతా పంటల సాగు విస్తీర్ణాన్ని క్రాప్ బుకింగ్ పేరు మీద చేయనున్నారు. సర్వే నెంబర్ల ఆధారంగా విస్తీర్ణాన్ని నమోదు చేయనున్నారు. డిజిటల్ సర్వేలో ఏఈవోలు తప్పనిసరిగా ఆ సర్వే నెంబర్‌కు 25 మీటర్లలోపు ఉంటేనే నమోదు అవుతుంది. దూరంలో ఉంటే సర్వే నెంబర్ ఆధారంగా పంటల విస్తీర్ణం నమోదు కాదు. డిజిటల్ సర్వేకు ఎక్కువ సమయం పడుతుండటంతో మార్చి చివరిలోపు మొత్తం పూర్తి చేసే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. క్లస్టర్ల వారీగా చేస్తున్న ఈ సర్వేను మండల స్థాయిలో ఏవోలు పర్యవేక్షిస్తున్నారు. ప్రతీరోజు ఈ సర్వే జరిగే విధంగా చూస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సర్వేను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం పంటల వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఈ డిజిటల్ సర్వేను చేపట్టినట్లు జేడీఏ వాజిద్ హుస్సేన్ తెలిపారు. ప్రతీ మండలం పరిధిలో ఈ సర్వే కొనసాగుతుందన్నారు. ప్రతీరోజు సర్వే నెంబర్ల ఆధారంగా పంటల వివరాలను డిజిటల్ సర్వేలో నమోదు చేస్తున్నామని ఆయన తెలిపారు.



సేవాలాల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జయంతి ఉత్సవాలలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు. వినాయక్‌నగర్‌లోని సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల బాధ్యులు, జిల్లా అధికారులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భోగ్ బండార్‌లో పాల్గొని నైవేద్యం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు, గిరిజన సంఘాల నాయకులు చంద్రునాయక్, కేతావత్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారు

- పట్టభద్రులకు 48 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు 33 కేంద్రాల ఏర్పాటు



నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి తుది పోలింగ్ కేంద్రాలను అధికారులు ఖరారు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టభద్రులకు సంబంధించి నిజామాబాద్ డివిజన్‌లో 21 పోలింగ్ కేంద్రాలు, బోధన్ డివిజన్‌లో 11 పోలింగ్ కేంద్రాలు, ఆర్మూర్ డివిజన్‌లో 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 31వేల 574 మంది పట్టభద్రుల ఓటర్లు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇందులో పురుష ఓటర్లు 19వేల 993 మంది ఉండగా, మహిళా ఓటర్లు 11వేల 581 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నిజామాబాద్ డివిజన్‌లో 10 పోలింగ్ కేంద్రాలు, బోధన్ డివిజన్‌లో 10, ఆర్మూర్ డివిజన్‌లో 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 3751 మంది ఓటర్లు నమోదు చేసుకోగా ఇందులో 2176 మంది పురుష ఓటర్లు, 1575 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కార్మికుల ఆందోళన

- దొంగలుగా ముద్రవేస్తున్నారని ఆగ్రహం • యార్డ్ సెక్యూరిటీ సిబ్బందిపై దాడి • పోలీసు వాహన అద్దాలు ధ్వంసం

ఖిల్లా, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో పని చేసే కార్మికులు శనివారం ఆందోళనకు దిగారు. మార్కెట్ యార్డ్‌లో పనులు బహిష్కరించి కార్మికులంతా కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. యార్డ్‌లో పని చేస్తున్న కార్మికులను యార్డ్ అధికారులు, సిబ్బంది కలిసి దొంగలుగా ముద్ర వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఉత్పత్తులను దొంగతనం చేస్తున్న వారెవరో తెలుసుకుని వారిని శిక్షించాలే తప్పా.. కార్మికులందరినీ ఒకే రకంగా చూడడం సరైంది కాదన్నారు. అనంతరం కార్మికులంతా కలిసి ఒక్కసారిగా మార్కెట్‌యార్డ్ కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో సిబ్బంది అడ్డుకోవడంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆందోళన సమాచారం తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని కార్మికులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ వారు వినలేదు. అదే సమయంలో మార్కెట్‌యార్డ్ సెక్యూరిటీ సిబ్బందిపై కొందరు కార్మికులు దాడి చేశారు. దీంతో పోలీసులు దాడిచేసిన కార్మికులను అరెస్టు చేసి.. స్టేషన్‌కు వాహనంలో తరలిస్తుండగా



వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు

తోటి కార్మికులు వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో పలువురు కార్మికులు పోలీసు వాహన అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు అదనపు బలగాలను రప్పించి.. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత యార్డ్‌లో ఉన్న సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. కాగా.. వాహనంపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. మరోవైపు.. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఈ ఘటనపై విలేకరులతో మాట్లాడారు. యార్డ్‌లో దొంగతనాలు జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై ప్రత్యేక దృష్టి పెట్టి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్కెట్‌లో రైతుల ఉత్పత్తులను దొంగతనాలు చేసే వారి ని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కేసీఆర్‌ను తెలంగాణ నుంచి ఎందుకు బహిష్కరిస్తారు?

- ఎవరిని అడిగినా తెలంగాణ రాష్ట్రాన్ని ఎవరు తెచ్చారో చెబుతారు • బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేసీఆర్‌ను తెలంగాణ నుంచి ఎందుకు బహిష్కరిస్తారని, తెలంగాణను తెచ్చినందుకా అంటూ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. వేల్పూర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చింది కేసీఆర్ అని, ఎవరిని అడిగినా చెబుతారని అన్నారు. రాష్ట్రం కోసం ఒక్కడిగా బయలుదేరి 15 ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేశారని అన్నారు. ఎన్నో పదవులను గడ్డి పోసలాగా వదిలివేశారని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించారని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలోనైనా చిన్నపిల్లల నుంచి ముసలి వారి వరకు ఎవరిని అడిగినా కేసీఆర్ గురించి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

చెబుతారని ఆయన అన్నారు. జై తెలంగాణ అన్న వాళ్ల మీదకి తుపాకి ఎత్తి పెట్టిన చరిత్ర రేవంత్‌రెడ్డిది అని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర తెలియనిది ఎవరికని ఆయన అన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం తేకపోతే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవాడా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కేసీఆర్‌ను బహిష్కరించడం సీఎం నుంచి కాదని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలే ఆయనకు అండగా ఉంటారని అన్నారు. కులగణన సర్వేలో ఇంటి నుంచి పెంచుకునే పశువుల వరకు అన్ని వివరాలు ఎందుకు తీసుకున్నారో అని విమర్శించారు. కుల గణనపై బీసీ సంఘాలే తప్పు పడుతున్నాయని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ సర్వే లెక్కలన్నీ తప్పుడువేనని ఎమ్మెల్యే అన్నారు. బీసీలు చైతన్యవంతులు అయ్యారని వారికి అన్ని తెలుసునని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

పిల్లల ఎదుటే భార్యను గొంతు నులిపి హత్య చేసిన భర్త

- మద్యానికి బానిసై డబ్బుల కోసం అఘాయిత్యం • ధర్పల్లిలో ఘటన
- న్యాయం చేయాలంటూ మృతురాలి కుటుంబీకుల ఆందోళన



ధర్పల్లిలో గాంధీ విగ్రహం ఎదుట అనూష మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

8

ఆదాయాన్ని అందించే సమగ్ర వ్యవసాయం

- సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్ల సాగు
- ఓ వైపు ఆదాయం.. మరో వైపు ఆరోగ్యం

7

ఆగ్రా మట్టి బాటిళ్లకు భలే గిరాకీ

వేసవికి ముందే.. వట్టిపోతున్న బోర్లు

- ఎండిపోతున్న పంటలు
- అడుగంటుతున్న చెరువులు, కుంటలు
- పంట పూర్తవడానికి మరో రెండు నెలలు
- ఆందోళనలో జిల్లా రైతులు




• మోపాల్‌లో బోరు ద్వారా నెమ్మదిగా వస్తున్న నీరు

మోపాల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవికి ముందే భూగర్భ జలాలు వేగంగా వట్టిపోతున్నాయి. ఇంకా ఎండలు ముదరకముందే భూగర్భ జలాలు ఇప్పుడే తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. నిన్నా.. మొన్నటి వరకు బాగా పోసిన బోర్లు ఇప్పుడు తగ్గిపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే వచ్చే మూడు నెలల్లో ఇంకా ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసిన వరి పంటలకు సాగు నీరు అందుతుందోలేదోనని రైతులు ఇప్పటి నుంచే గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఒక ఎకరం వరి పంటకు సుమారు 25వేల రూపాయల వరకు ఖర్చు పెట్టామని రైతులు వివరించారు. ఒక్కొక్క రైతు రెండు ఎకరాల నుంచి 8, 10 ఎకరాల వరకు పంటలు సాగు చేశారు. ఎండలు ముదరడంతో గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలు ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. మండలంలోని కొన్ని గ్రామాలకు కాలువల ద్వారా వస్తున్న నీటితో పంటలకు సాగునీరు అందించుకుంటున్నామని వారు పేర్కొన్నారు. ఇంకా పంటలు రైతుల చేతికి రావాలంటే మరో రెండు నెలలైనా పడుతుందని తెలిపారు. ప్రతీ సంవత్సరం ఎండాకాలంలో రైతులకు నీటి ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. పాలకులు రైతులను ఆదుకోవడంలో విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. రైతులకు చేసింది ఏమీ లేదని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. పంటలు ఎండిపోకుండా పాలకులు చూడాలని కోరుతున్నారు. వేసవిలో కరెంటు కోతలు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని రైతులు పేర్కొంటున్నారు.

బోర్లు ఎత్తిపోతున్నాయి..


: కన్నె చిన్నారెడ్డి, రైతు సిర్పూర్



వ్యవసాయ పొలాల వద్ద ఉన్న బోర్లు ఎత్తిపోవడంతో అయోమయంలో పడవల్సిన పరిస్థితి వచ్చింది. పంటలకు నీరు అందకపోవడంతో భయంగా ఉంది. ఇప్పుడు నీటి సమస్య ఇట్ల ఉంటే వచ్చే రెండు నెలల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయి. అప్పుడు రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో భయంగా ఉంది. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలి.

రైతులను ఆదుకోవాలి..

: భూమయ్య, రైతు సిర్పూర్



తనకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో వరి పంటను వేశాను. ఎండలు తీవ్రంగా ఉండటంతో వేసిన బోర్ల నుంచి నీరు పొలాలకు అందకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. నాలుగు ఎకరాలలో రెండు బోర్లు వేశాను. ఈ బోర్ల నుంచి కూడా నీరు ఎక్కువగా రావడం లేదు. పంట చేతికి వస్తుందోలేదోనని భయంగా ఉంది. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చూడాలి.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

సాలూర,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సాలూర మండలం జాడి జమాల్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోగ్గినేని ఇన్నయ్య చౌదరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జాడి గ్రామంలో మాజీ సర్పంచ్ ఇన్నయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్ ఇన్నయ్య చౌదరి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను మరువలేనివని ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఆయన వెంట టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, అల్లె రమేష్, అల్లె జనార్థన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపివేయాలి



పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఏర్గట్ల,ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మి స్తున్న సెల్‌టవర్‌ను పనులు నిలిపివేయాలని కోరుతూ శనివారం గ్రామస్థులు తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో వెంక టేశ్వర్లు,పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ సెల్‌టవర్ వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని,కొన్నిరోజుల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కారుపాకల నర్సయ్య,జైనోద్దీన్ పాల్గొ న్నారు.

దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందవచ్చు



మోర్తాడ్ డిగ్రీ కళాశాలలో బ్రిజేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న లెక్చరర్

మోర్తాడ్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యరంగంలో డిగ్రీ అడ్మిషన్‌లలో దోస్త్ ద్వారా రాష్ట్రంలో ఏ కళాశాలలోనైనా అడ్మిషన్‌లు పొందే అవకాశం ఉందని తెలంగాణ ప్రభుత్వ కాలేజీ లెక్చరర్‌ల అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బ్రిజేష్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీలో దోస్త్ ద్వారా అడ్మిషన్‌లు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.పెద్దన్న, లెక్చరర్‌లు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని భీమ్‌గల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సతీష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుమలత, వైస్‌ప్రిన్సిపాల్ మర్రిపల్లి భూపతి, అకాడమిక్ కోఆర్డినేటర్ దశరథ, లెక్చరర్‌లు రవీందర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): బోధన్, సాలూర మండలాల మంజీర సరిహద్దు గ్రామాల నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక రవాణా చేయాలని, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు ఉన్న పగటి పూట మాత్రమే ఇసుక రవాణా చేయాలని, రాత్రిపూట ఇసుక రవాణా చేయవద్దని హెచ్చరించారు.

కొడిచర్లలో..

కోటగిరి: పోతంగల్ మండలంలోని కొడిచర్ల శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో పడి జాలరి మృతి

ముప్కాల్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం నాగాపూర్ ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో పడిలో బాల్కొండ మండలానికి చెందిన బట్టు నారాయణ(50) అనే జాలరి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతీరోజు ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో చేపలు పడుతూ జీవిస్తున్న నారాయణ శనివారం ఉదయం చేపలు పట్టే క్రమంలో ఆకస్మాత్తుగా చేపల కోసం పెట్టిన కందిలో పడి చిక్కుకోవడంతో ఊపిరి అడక చనిపోయాడని తెలిసింది. దీంతో గజాఈతగాళ్ల నారాయణ మృతదేహాని బయటకు తీశారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జానకంపేటలో భారీ చోరీ



చోరీ వివరాలను అడిగి తెలుసుకుంటున్న బోధన్ రూరల్ సీఐ

ఎడపల్లి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన నీలా భాస్కర్ ఇంటి తాళం పగుల గొట్టి సుమారు రూ.20 లక్షల విలువగల సొత్తును ఎత్తు కెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం తన సోదరుని కుమారుడి వివాహంలో భాగంగా శుక్రవారం హల్దీ ఫంక్షనుకు కుటుంబ సమేతంగా వెళ్లామని తెలిపారు. శనివారం ఉదయం జానకంపేటలోని తమ ఇంటికి రాగానే ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, శుక్రవారం రాత్రి దుండగులు పక్క ఇంటి నుంచి ఇంటిలోకి ప్రవేశించి పడక గదిలోని బెడ్‌కు అమర్చిన బాక్సును తెరిచి సుమారు 12 తులాల బంగారం, 2కిలోల వెండి వస్తువులు, 3లక్షల 20వేల నగదును దోచుకెళ్ళారని తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, బాధితులను చోరీ విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

రేంజ్ ఆఫీస్‌ను ముట్టడించిన తాటిపల్లి గ్రామస్థులు



రేంజ్ ఆఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు



నరికివేతకు గురైన అటవీ

సిరికొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తాటిపల్లి గ్రామానికి చెందిన సుమారు 60 మంది వరకు రేంజ్ ఆఫీస్‌ను ముట్టడించారు. గ్రామ పరిధిలో అడవిని విచ్చలవిడిగా నరికివేతకు అటవీశాఖ సిబ్బంది సహకరిస్తున్నారనేదానిపై వారు రేంజ్ అధికారి రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో దళిత గిరిజనులు అటవీ భూమిని స్వాధీనం చేసుకొని సాగు చేసుకుంటున్నారు. అయితే దళిత కుటుంబాల వారు స్వాధీనం చేసుకున్న భూమిని పంటలు వేసుకుందామంటే అటవీ శాఖ అధికారులు అడ్డుపడుతున్నారని అన్నారు. దళితులు అడవికి వెళ్లిన వారిపై కేసులు నమోదు చేస్తూ మరో వర్గానికి విచ్చలవిడిగా అడవి నరికి వేతకు అటవి శాఖ సిబ్బందే సహకరిస్తూ దగ్గ రుండి ట్రాక్టర్లతో చదును చేయడానికి సహకరిస్తు న్నారని వారు ఆరోపించారు. దళితులపై గతంలో కేసులు పెట్టి జైలుకు పంపించారని అలాగే 50వేల డబ్బులు గతంలో తీసుకున్నారని దళిత యువ కులు బహిరంగంగా చెప్పారు. ఈ విషయాలన్నీ రేంజ్ అధికారికి పూసగుచ్చినట్లు వివరించారు. అడవి నరికివేతకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ద్వందనీతిని అనుసరించవద్దని వారు రేంజ్ అధికారికి సూచించారు. రేంజ్ అధికారి రవీందర్ స్పందిస్తూ మీరు చెప్పిన విషయాలపై విచారణ చేస్తామని సిబ్బంది తప్పు చేస్తే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని ఆయన చెప్పడంతో గ్రామస్తులు వెనక్కి వెళ్లిపోయారు.

ఇంటి నిర్మాణ భూమిపూజకు వస్తూ.. మృత్యు ఒడిలోకి !

● రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి, కూతురికి తీవ్ర గాయాలు ● కామారెడ్డి జిల్లాలో ఘటన



మృతుడు, మృతుడి కూతురు

వేల్పూర్,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):తనస్వగ్రామంలో నిర్మించే గృహానికి భూమిపూజ చేసేందుకు దుబాయి నుం చి వస్తూ ఒకరు మృత్యువాత పడిన ఘటన కామారెడ్డి జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామానికి చెందిన ర్యాడ గంగాధర్ (40) రెండేళ్ల క్రితం బతుకు దెరువు నిమిత్తం దుబా యికి వెళ్లాడు. తన స్వగ్రామమైన కుకునూరులో నిర్మించే ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు శుక్రవారం సాయంత్రందుబాయి నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. హైదరాబాద్‌లో బీటెక్ చదువు తున్న తన కూతురు లహరిని కారులో తీసుకొని నిజామాబాద్ జిల్లాకు కునూర్‌కు బయలుదేరాడు.మార్గమధ్యలో కామారెడ్డిజిల్లా సదాశివ్‌నగర్ వద్దకారు అతివేగంతో అదుపు తప్పిరోడ్డుప్రమా దానికి గురైంది.ఈఘటనలో గంగాధర్ కారులోనే మరణిం చగా.. కూతురు లహరి తలకు తీవ్రగాయాలయ్యాయి.దీంతో ఆమె ను మెరుగైనచికిత్సకోసం హైదరాబాద్‌లోని ప్రైవేటుఆసుప త్రికి తరలించారు.విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యు లు, బంధువులు, గ్రామస్థులు ఘటనా స్థలికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా..ఈ ఘటనతో మృతుడి స్వగ్రామమైన కుకునూర్‌లో విషాద ఛాయలు నెలకొన్నాయి.

ఏటీఎం నుంచి రూ.లక్షా 90 వేల నగదు చోరీ



రుద్రూర్ పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న బాధితురాలు

రుద్రూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలంలోని సులేమాన్ ఫారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ షేక్‌గౌస్, స్వయాన తన వదిన అకౌంట్లో ఉన్న రూ.1,90.000 నగదును చోరీ చేశాడని బాధితులు పేర్కొంది. రుద్రూర్ పెట్రోల్ బంక్‌తో పాటు కోటగిరి పెట్రోల్ బంక్ నుంచి డబ్బులు డ్రా చేసుకొని మోసం చేయడం జరిగిందని బాధితురాలు శనివారం రుద్రూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా మీడియాతో ఆమెమాట్లాడుతూ..తన భర్త విద్యుత్ షాక్‌తో మృతి చెందడం జరిగిందని అప్పటి నుంచి వారు వేధింపులకు గురి చేస్తున్నాడని, పని నిమిత్తం ఇతర గ్రామానికి వెళ్లినప్పుడు మేము లేనిది చూసి తన గృహంలో అక్రమంగా చొరబడి ఏటీఎం కార్డును దొంగిలించిన మాజీ ఎంపీటీసీ గౌస్ బాధితురాలి ఏటీఎం కార్డును తీసుకుని రూ.1,90.000 అపహరించడం జరిగిందని బాధితురాలు బోరున విలపించింది. అపహరించిన డబ్బులు తిరిగి చెల్లించేలా చూడాలని, న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులకు విన్నవించింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పెద్ద మొత్తంలో డబ్బులు స్వాహా చేశాడన్నారు. ఓ మాజీ ప్రజా ప్రతినిధి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓలీడర్, బాన్సువాడ నియోజకవర్గంలో పేరున్న ఓ కుటుంబంలో పుట్టి మాజీ ఎంపీటీసీగౌస్ ఈపని చేయడం పట్ల సమంజసం కాదని బాధితురాలు, ఆమెతోవచ్చిన కొంతమంది ఆయన తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలికి న్యాయం జరుగుతుందా లేదా అని వేచి చూడాల్సి ఉందని పలువురు ఎదురుచూస్తున్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇంటర్నేషనల్ చైల్డ్ హుడ్ క్యాన్సర్ డే సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినిలకు సర్టిఫికెట్‌లు, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, సభ్యులు శశిధర్‌రెడ్డి, బైరీ శ్రీధర్, ప్రధానోపాధ్యాయురాలు వనజ, ఉపాధ్యాయులు కవిత, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడిగా పత్తి రాము

రుద్రూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో శుక్రవారం నాలుగు తర్పల మున్నూరు కాపు సంఘ సభ్యులు సమావేశమై గ్రామ మున్నూరు కాపు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా పత్తి రాము, ప్రధాన కార్యదర్శిగా ఇందూర్ కార్తీక్, కోశాధికారిగా పార్వతి శేఖర్, ఉపాధ్యక్షులుగా అడప సాయిలు, కర్క అశోక్, కొప్పర్గ గంగాధర్, జల్లాపురం సాయికుమార్, జాయింట్ సెక్రటరీలుగా అడప శంకర్, ఉప్పు గంగాధర్, ఇందూర్ తులసి రామ్, జల్లాపురం సాయిలు (ఎస్టీడి), గౌరవ సలహాదారులుగా ఇందూర్ చంద్రశేఖర్, దుర్కి సాయన్న, పత్తి లక్ష్మణ్, కొట్న లక్ష్మణ్, జక్కు నర్సింలు, తోట్ల గంగారాం, నాగం అశోక్, చంద రవికుమార్, కాసుల శ్రీనివాస్, జల్లాపురం నడిపి సాయిలు, 19 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

డిగ్రీ కళాశాలలో సైన్స్ అండ్ టెక్నాలజీ మోడల్ ఎగ్జిబిషన్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో శనివారం సైన్స్ అండ్ టెక్నాలజీ మోడల్ ఎగ్జిబిషన్ నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక తెలిపారు. ప్రతీవారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా గర్ల్స్ ఇన్ టీం అనే అంశం విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. శాస్త్రా సాంకేతిక రంగంలో అనేక కొత్త ఆవిష్కరణాలు, వినూత్న ప్రయోగాలకు సంబంధించిన వాటిని విద్యార్థులు ప్రదర్శించగా వృక్ష, భౌతిక, రసాయనిక, జంతుశాస్త్రలతో పాటు మైక్రోబయోలాజీ, కంప్యూటర్ సైన్స్, స్టాటీస్టిక్స్, గణిత విభాగాలలో విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించి వివ రించారు.ఈకార్యక్రమంలో కళాశాలవైస్‌ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కెరీర్ సక్సెస్' పై కార్యశాల

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ కెరీర్ సక్సెస్ అనే అంశంపై కార్యశాల నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణుప్రసాద్ తెలిపారు. రిసోర్స్ ఎర్సన్‌గా కెఎఫ్ఏఐ డీమ్డ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వామిబైరి విద్యార్థులకు ఇంగ్లీష్ బాష నైపుణ్యాలు, కర్రీకులంపీఠం, రెస్యూమేను ఏలా తయారు చేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యశాల కోఆర్డినేటర్ లింగన్న, కన్వీనర్ వి..శ్యామ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

20న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

ఆర్మూర్‌టౌన్,, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమో క్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయ కుడు సూర్య శివాజీ, అబ్దుల్, బాలయ్య, పీడీఎస్‌యు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రెంజల్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి వాజీద్ హుస్సేన్ పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఆయన వెంట ఏవో బొబ్బ శ్రీనివాస్ తదితరులున్నారు.

పిల్లల్లో క్షయవ్యాధి నిర్ధారణపై శిక్షణ

వర్ని,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, టీబీ అలెర్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందికి 0-14సంవత్సరాల లోపు పిల్లల్లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి లక్షణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దీర్ఘకాలిక దగ్గు, రెండు వారాల కంటే ఎక్కువ దగ్గు, దగ్గుతో పాటు కళ్లె తెమడ, రక్తం రావడం, జ్వరం రెండు వారాలకు మించి ఉండటం ప్రత్యేకంగా రాత్రివేళ చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ, పద్మజ, మెడికల్ ఆఫీసర్లు స్నేహ, ఉమా, టీబీ అలెర్ట్ ఇండియా జిల్లా సమన్వయ కర్త అమృత రాజేందర్, స్టేట్ నర్స్ మెంటర్ ఉషా రాణి, హెడ్ నర్స్ మిర్జా బీపాషా పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే



భీమ్‌గల్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని చొక్కయ్యగుట్టపై అయ్యప్పస్వామి ఆలయంలో కొనసాగుతున్న మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అయ్యప్ప నిర్మించి 12ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవం నిర్వహించి అనంతరం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు నర్సయ్య, రవి, భగత్, సురేష్, కార్యకర్తలు ఉన్నారు.

సకాలంలో పన్నులను చెల్లించాలి

భీమ్‌గల్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఆస్థి పన్నులకు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలో ఆస్తి పన్ను వసూలు చేస్తున్న బృందాలను తనిఖీ చేశారు. ఇంటి దుకాణ యాజమానులు మార్చి 31లోపు పన్నులను చెల్లించి సహకరించాలని కోరారు. సకాలంలో చెల్లించకుంటే వడ్డీతో కట్టాల్సి ఉంటుందని అంతేగాకుండా 2019మున్సిపల్ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

భీమ్‌గల్‌రూరల్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి):మండలంలోని గ్రామాల మహిళ సంఘాల సభ్యులకు శనివారం ఐకెపీ కార్యాలయంలో ఆరోగ్యంగా, పోషణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకెపీ ఏపీఎం రవీంధర్ మాట్లాడుతూ ఆర్థిక అభివృద్ధి చెందాలంటే మొదట ఆరోగ్యం పటల జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే పౌష్టికాహారం భుజించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిరుపేదలకు ఆరోగ్యమే అస్తి అని, ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థిక అభివృద్ధి పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐకెపీ సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, రఘుపతి, గంగసాయిలు, మహిళసంఘాల లీడర్‌లు, వీవోఏలు,పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దు

ఆర్మూర్‌టౌన్,, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడవద్దని మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టార్ గజానంద్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు శనివారం మామిడిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, అలాగే 31వార్డులోని మహిళలకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్, వార్డు ఆఫీసర్‌లు నాగరాజు, నిలిమ, యుగంధర్, మెప్మా ఆర్‌పీ, మహిళలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం



తాహెర్‌బిన్‌హందాన్‌ను సన్మానిస్తున్న జీజీ ఫౌండేషన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్,, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ ఉర్దూ అకాడమిక్ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌ను పట్టుశాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉర్దూ అకాడమిక్ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకంతో విశ్వసంతో పదవీ బాధ్యతలు కట్టబెట్టిందని, కార్పొరేషన్ పదవి రాగా ప్రజలకు అభివృద్ధి పనులు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్ గుజరాతి, డిజె.దయానంద్, అల్జాపూర్ రాజేశ్వర్, నారాయణవర్మ, బోచ్‌కర్ వేణు, డిజే.సునీల్, బెల్దారి శ్రీనివాస్, గిరిబాబు, నవీన్, కాశీనాథ్,పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం



నాళేశ్వర్‌లో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నవీపేట,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో శనివారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆరు రోజుల పాటు క్రికెట్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని, పోటీలలో గెలుపొందిన వారికి వచ్చే మహాశివరాత్రి రోజున బహుమతులు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాలుగా మహ శివరాత్రి ఉత్సవాలకు ముందు యువకులకు ఈ క్రికెట్ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ నరిన్, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలి



అంక్సాపూర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో స్వర్ణలత

వేల్పూర్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. ఐసీడీఎస్ భీమ్‌గల్ ప్రాజెక్టు పరిధిలో శనివారం వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళ, శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ జిల్లా మహిళ, బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం బేటీ బాచావో బేటీ పడావో కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో స్వర్ణలత మాట్లాడుతూ పాఠశాలలు విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడ పిల్లల లింగ నిష్పత్తిని పెంచడం, లింగ నిష్పత్తిని తగ్గుదలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ఆడ, మగ పిల్లలకు సమాన హక్కులు ఉన్నాయన్నారు. శిశు, భ్రూణహత్యలు జరగకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. ఆడ పిల్లల ప్రాముఖ్యత ఎందుకు తగ్గుతుందంటే చిన్నతనంలోనే పెళ్ళిళ్లు చేయడం ద్వారా భ్రూణహత్యలకు పాల్పడడం ద్వారా ఆఘాయిత్యాల వల్ల ఆడ పిల్లలు పసిపిల్లల మరణాలు ఎక్కువయ్యాయని వివరించారు.అంతకు ముందు సూపర్‌వైజర్‌లు ఉషారాణి,సౌమ్య,స్రవంతి,సునీత ఆధ్వర్యంలో బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, వాటిని అధిగమించిన వాళ్ల సాధించిన విజయాల గురించి ఫిల్మ్‌షో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మల్లేశ్వరి,పోషణ అభియన్‌ప్రశాంత్, అంగన్‌వాడి టీచరు స్వరూప,మంజులసునంద, స్వరూప,ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంలో శనివారం మాఘమాసం మూడో శనివారం సందర్భంగా వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా నిరంతరం పఠించాలని సకల దోషాలు తొలగి సకల శుభాలు కలుగుతాయన్నారు. ఆలయానికి వచ్చిన మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గుండెటి శంకర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి రాములు, అర్చకులు ప్రవీణ్ కుమార్, సంజీవ్ పటేల్, భక్తులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి

పెర్కిట్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి):మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని పీడీ ఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు.పట్టణంలో నిర్వహించి సమా వేశంలో వారు మాట్లాడుతూ ఫీజు రియింబర్స్‌మెంట్‌పై ఆదారపడి డిగ్రీ, పీజీ, ఇంజ నీరింగ్ కోర్సులుచేస్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని లేనిచో చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి జిన్నారపు రాజేశ్వర్, పట్టణ డివిజన్ అధ్య క్షుడు ప్రిన్స్, రాహుల్, కళ్యాణ్, పవన్, సాయి, రహమన్, నిశాంత్, అక్షయ్, రిషి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

నవీపేట,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అంతకు ముందు విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉనుక లారీ కిందకు దూసుకెళ్లిన ట్రాక్టర్



లారీ కిందికి దూసుకు వెళ్లిన ట్రాక్టర్

కోటగిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలో శనివారం ఉనుక లారీ కిందకు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దూసుకెళ్లింది. పొతంగల్ వైపు వెళ్తున్న సిమెంట్ ఇటుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ అదుపు తప్పి లారీ కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ట్రాక్టర్, లారీ డ్రైవర్లు ఊపిరి పీల్చుకున్నారు.

అంకాపూర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం



అంకాపూర్‌లో కుక్కకాటుతో గాయపడ్డ మల్లుబాయి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో వివిధ చోట్ల ఆరుగురిని పిచ్చికుక్క కరిచి గాయపర్చింది. సుశీల, మల్లుబాయితో పాటు మరో నలుగురు పిల్లలపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. కుక్క కాటుకు గురైన వ్యక్తులను ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. గత కొంత కాలంగా ఆర్మూర్‌లో కుక్కల బెడద ఎక్కువైంది. ఇటీవల పెర్కిట్‌లో కుక్కలు గేదేను కరిచి చంపివేశాయి. అదే విధంగా ఇటీవల ఆర్మూర్ పట్టణంలో ఇద్దరు పిల్లలపై దాడి చేసి కరవడంతో వారు తీవ్రంగా గాయపడి నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు గత 15రోజుల్లో వివిధ గ్రామాల్లో సుమారుగా 90మందిపై కుక్కలు దాడి చేసినట్టు తెలిసింది.. కుక్కల బెడద ఎక్కువైందని అధికారులు వాటిని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫటా..ఫట్...

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి

● రాజు ఏపీఎం దోమకొండ



దోమకొండ మండలంలో 9 గ్రామ పంచాయతీలలో 29గ్రామ సంఘాలు ఉన్నాయని సంఘ సభ్యుల అభివృద్ధికి గ్రామాల్లో సీసీలు, సీఏలు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేవిధంగా కృషి చేస్తున్నట్లు దోమకొండ ఏపీఎం రాజు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారిలా..

ఆంధ్రజ్యోతి:మండలంలో మొత్తం ఎన్ని గ్రామ సంఘాలు ఉన్నాయి?

ఏపీఎం:మండలంలో మొత్తం 29 గ్రామ సంఘాలు ఉన్నాయి

ఆంధ్రజ్యోతి:మండలంలో మొత్తం స్వయం సహాయక సంఘాలు ఎన్ని ఉన్నట్లు?

ఏపీఎం:మండల పరిధిలో మొత్తం 807 స్వయం సహాయక సంఘాలు కలవు.

ఆంధ్రజ్యోతి:సంఘాలలో మొత్తం సభ్యులు ఎందరుఉన్నారు?

ఏపీఎం:మొత్తం 8416 మంది సభ్యులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: రుణాలకు సంబంధించి టార్గెట్ ఉందా?

ఏపీఎం:2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్‌లోన్ 672 సంఘాలకు రూ. 29 కోట్ల 15 లక్షల 18 వేలు((2915.18) టార్గెట్ కలదు. అందుకు 2024-25 సంవత్సరంలో 645 సంఘాలకు గాను రూ.32 కోట్ల 22లక్షల 10 వేలు సంఘాల సభ్యులకు అందించడం జరిగింది. 110 శాతం చేయడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: శ్రీనిధి ద్వారా టార్గెట్ ఎంత వరకు ఉంది?

ఏపీఎం:శ్రీనిధి ద్వారా రూ. 3కోట్ల 86 లక్షల 68 వేలు టార్గెట్ ఉంది. అయితే ఇప్పటి వరకు శ్రీనిధి ద్వారా రూ. 4కోట్ల 15లక్షల 71 వేయి రుణాలు అందజేయడం జరిగింది. 107శాతం చేయడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: మహిళా శక్తి కార్యక్రమాలు చేపడుతున్నారా?

ఏపీఎం:మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగంగా ఆదాయ అభివృద్ధిలో చిన్న వ్యాపారాలు, పెరటి కోళ్ల పెంపకం, గేదెలతో పాటు ఇతర కార్యక్రమాలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి:కొత్తగా మహిళలను సంఘాలలో చేర్చుకుంటున్నారా?

ఏపీఎం: ఈ సంవత్సరంలో అర్హత కల్గిన 353 మంది మహిళలను సంఘాలలో చేర్పించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: రుణాలు మంజూరు సమయంలో ఒకరికి బదులు మరోకరి ఖాతాల్లో డబ్బులు జమ అయిన సంఘటనలు ఉన్నాయా?

ఏపీఎం: అలాంటి అవకాశం ఉండదు. సంఘాలలో ఉన్న సభ్యులకు సంబంధించి సీఏలు, సీసీలు పేర్లను పరిశీలించి తప్పులు దొర్లకుండా ఒకటికి రెండు సార్లు పరిశీలన చేసిన తర్వాతే పూర్తి నివేదికను బ్యాంక్ అధికారులకు అందజేస్తాం. అలాంటి సంఘటనలు జరిగే అవకాశమే ఉండదు.

● (ఆంధ్రజ్యోతి,దోమకొండ)

6న జన్నేపల్లి శివాలయ ఆధునికీకరణ పనులు

● శివాలయాన్ని సందర్శించిన తొగుట-రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి



నవీపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలోని చారిత్రక శివాలయ ఆధునికీకరణ పనులను వచ్చే నెల 6 గురువారం రోజు నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఆలయాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా తొగుట-రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు సందర్శించారు. పూర్వపు రోజుల్లో వచ్చిన భూకంపానికి ఆలయం ఒక వైపు వంగిపోయింది. వంగిపోయిన ఆలయాన్ని సరి చేయడానికి శనివారం స్థానిక శివాలయంలో గ్రామస్థులు, వీడీసీ సభ్యులతో మాధవానంద సరస్వతీ స్వామి, మైనంపల్లి హన్మంత్ రావులు చర్చించారు. చర్చల అనంతరం వచ్చే నెల 6న ఆలయ ఆధునీకరణ పనులు చేపట్టాలని అందరి సమక్షంలో నిర్ణయించారు. శుక్రవారం రాత్రి గ్రామానికి చేరుకున్న మాధవానంద సరస్వతి స్వామి స్థానిక శివాలయంలో నిద్ర చేశారు. శనివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన

వేల్పూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో ఏంగంటి, దువ్వాల కుటుంబ సభ్యులు, భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్థానిక పురోహితుడు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్చరణాల మధ్య గణపతిపూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వర్ణం, నవగ్రహ వాస్తు, క్షేత్రపాలకయోగిని, సర్వతోభద్ర మండప దేవతాపూజలు, యజ్ఞహోమాలు, శిఖరానికి జల, ధాన్య, ఫల, పుష్పదివాసం, కుంభ సంప్రోక్షణ, తీర్థప్రసాదం, మహాశీర్వాద వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏంగంటి దువ్వాల కుటుంబసభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

ఎడపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామ శివారులో శివారు రైతులు, గ్రామస్థులు నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గణపతిపూజ, పుణ్యహవచనము, గోనంతపూజ, నవగ్రహపూజ, యజ్ఞశాల ప్రవేశము, దేవత హవనము, జలదివాసం, గణపతి హవనం కార్యక్రమాలను నిర్వహించి విగ్రహాలను ఎడపల్లి శివాలయం నుంచి హారతులతో ఊరేగింపుగా ఆలయానిక తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో రైతులు, భక్తులు పాల్గొన్నారు.



యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు



పిట్లంలో సెంట్రల్ లైటింగ్ రోడ్డు దృశ్యం



వ్యాపార సముదాయాల ముందు నిలిచిన మురుగు నీరు



రోడ్డు తవ్వి కంకర వేసిన దృశ్యం

సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు బ్రేక్!

» పిట్లంలో డ్రైనేజీలు లేక రోడ్డుపై రోడ్లపైనే పారుతున్న మురికి నీరు » దుర్వాసనతో వాహనదారులు, ప్రజల అవస్థలు » భారీ వాహనాలతో దుమ్మూ దూళితో ఇబ్బందులు » పట్టించుకోని అధికారులు

పిట్లం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆరు నెలల కిందట రూ.12 కోట్ల వ్యయంతో ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. పిట్లంలో సాయి బాబా ఆలయం నుంచి హెచ్‌పీ పెట్రోల్ పంపు వరకు సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనుల కోసం 12 కోట్ల రూపాయలు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం కోసం, రహదారి విస్తరణ కోసం మట్టిని తోడి కంకర మొరం పనులు కొనసాగించారు. అయితే పనులు మధ్యలో నిలిచివేయడంతో దుకాణదారులు, ప్రజలు, వాహపదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు నిలిపివేయడంతో దుకాణదారులకు వ్యాపారాలు చెసుకునేం దుకు వీలు లెకుండా కొనుగోలు చేసేందుకు ఇబ్బందులకు గురవుతూ కొనుగోలుదారులు రాకపోవడంతో పాటు ఉదయం నుంచి రాత్రి వరకు దుమ్మూ దూళి వస్తుండడంతో రోగాల భారిన పడుతున్నామని వ్యాపారులు వెడుకుంటున్నారు.



రోడ్డుపై నిలిపిన వాహనాలు

డ్రైనేజీ పనులు నిలిచిపోవడంతో దుర్వాసన

సెంట్రల్ లైటింగ్ పనుల కొసం వ్యాపార సముదాయాల ముందు డ్రైనేజీని పనుల కొసం తవ్విన కాంట్రాక్టర్ పనులు సాగకపోవడం, మురికి నీరంతా దుకాణాల ముందు, రహదారిపై ప్రవహిస్తూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. దాంతో ప్రయాణికులు, వాహనదారు లు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా నిలిచి పోయిన సెంట్రల్ లైటింగ్ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చెస్తె ఇబ్బందులు తొలిగిపోతాయంటూ ప్రజలు వెడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు పనులు ప్రారంభించెలా తగు చర్యలు తీసుకొవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజ్ పనులు కొనసాగించాలి

● శంకర్, పిట్లం



సెంట్రల్ లైటింగ్ పనులలో రోడ్డు పక్కను తవ్వి డ్రైనేజ్ పనులు కొనసాగకపోవడంతో రహదారి వెంట దుర్వాసన వెదజల్లుతుంది. కాంట్రాక్టర్ నెలలుగా పనులు నిలిపి వెయడంతో మురికి నీరుకు దారి లేక రహదారిపై పారుతుంది. రహదారిపై నడిచి వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు కొనసాగించాలి.

రహదారి వెంట దుమ్మూ దూళి

● వడ్డే నవీన్, పిట్లం



సెంట్రల్ లైటింగ్ పనుల కొసం రోడ్డు కు ఇరువైపుల తవ్వి మొరం, కంకర వేసిన కాంట్రాక్టర్ పనులు నిలిపి వేయడంతో వాహనాల రాకపోకలతో దుమ్మూ దూళితో అనారోగ్యానికి గురవుతున్నాము. వాహనాల దుమ్మంతా వ్యాపార సముదాయాల్లో వచ్చి చేరుతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి దుమ్మూ దూళి రాకుండా రహదారిపై నీరు పొయాలని, పనులు త్వరగా పూర్తి చెయాలని కొరుతున్నాము.

పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న ఇటుక బట్టీలు

● అనుమతులు లేకున్నా జోరుగా నిర్వహణ ● ఇటుక బట్టీల పై చర్యలేవీ..!? ● నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం ● కన్నెత్తి చూడని అధికారులు



జేసీబీ ద్వారా అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్న దృశ్యం





ఇటుకలు తయారు చేస్తున్న దృశ్యం

రుద్రూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అంతా మా ఇష్టం.. మనల్ని ఎవరు రా ఆపేది అనే తీరుగా అడ్డూ అదుపు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్, రాయకూర్, కొండాపూర్ గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ పుట్ట గొడుగుల్లా ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి. ప్రజలు నివసించే ప్రాంతాలకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఇటుక బట్టీలు తయారు చేయాలని నిబంధనలు ఉన్నా వాటిని వ్యాపారులు తుంగలో తొక్కుతున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అనుమతులు లేకున్నా ఇటుకల వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. ఒక్కో ఇటుకకు ఆరు నుంచి ఏడు రూపాయల చొప్పున వ్యాపారులు వసూల్లు చేస్తున్నా చాలా మంది వ్యాపారులు ప్రభుత్వానికి నయా పైసా కూడా చెల్లించడం లేదు. వ్యాపారులు ఐదు శాతం (వ్యాట్) చెల్లించడం గాని అనుమతులు పొందడం లాంటివి చేయడం లేదని, దీంతో ప్రభుత్వ ఆధాయానికి పెద్ద మొత్తంలో గండి పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటుకల తయారీ కోసం పొలాలు, గుట్టలలో, అటవీ ప్రాంతంలోని మట్టిని త్రవ్వి ఇటుకలు తయారు చేస్తున్నారు. మట్టిని త్రవ్వాలంటే భూగర్భ శాఖ, గ్రామ పంచాయతీ అనుమతి కూడా ఉండాలి. మండలాలల్లో కుప్పలు తెప్పలుగా ఇటుక బట్టీలు వెలిసినా ఏ ఒక్క దానికి అనుమతులు లేనట్లు తెలుస్తోంది. ఇటుకలు విక్రయించగా అమ్మకం పన్ను విలువ అధారిత పన్ను (వ్యాట్) వీటికి ఐదు శాతం ఉంటుంది. ఈ విక్రయాలకు పన్ను చెల్లించాల్సి ఉన్నా అది కూడా అమలు కావడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లను నరికివేసి ట్రాక్టర్లలో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల వ్యాపారం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇటుక బట్టీల నిర్వాహణ చేయాలంటే గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు, కార్మిక శాఖ, విద్యుత్ శాఖ, రవాణా శాఖ, ఫారెస్ట్ తదితర శాఖల వద్ద అనుమతులు పొందాలి. ప్రజా నివాస ప్రాంతానికి కిలోమీటర్ దూరంలో ప్రధాన రహదారికి 200 మాటర్ల దూరంలో ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతారు చేస్తూ బట్టీల నిర్వాహణ కొనసాగిస్తూన్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా ఎటువంటి నియమాలు పాటించకుండా జనవావాసాల మధ్య ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంతో దాని నుంచి వచ్చే కాలుష్యం వలన చాలా ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

అధికారుల చర్యలేవీ?

జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు వెలుస్తున్న సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో మట్టి కోసం చెరువులు, పొలాలు, గుట్టలను త్రవ్వుతున్నా అటశాఖ అధికారుల్లో చలనం కనిపించడం లేదు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నా ఇటుక బట్టీలపై దాడులు చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారికి వచ్చే మామూళ్లతో చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ వ్యాపారం జోరుగా కొనసాగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నా ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోని, ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.







మట్టి బాటిళ్లను కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఆగ్రా మట్టి బాటిళ్లకు భలే గిరాకీ



ఆగ్రా నుంచి తీసుకువచ్చిన మట్టి బాటిళ్లకు నగర వాసులు ఫిదా అవుతున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లతో నీరు తాగడం వల్ల అనారోగ్యాలు వస్తాయంటూ శాస్త్ర వేత్తలు చెప్పడంతో ప్రజలు ప్రత్యమ్నాయాలవైపు చూస్తున్నారు. కొందరు గాజు బాటిళ్ల వైపు మొగ్గు చూపుతుంటే మరికొందరు మట్టి బాటిళ్లవైపు మొగ్గు చూపుతున్నారు. ఆగ్రా నుంచి ఎర్ర మట్టితో తయారు చేసిన మట్టి బాటిళ్లను నగరానికి తీసుకువచ్చి రోడ్లపై తోపుడు బండ్లలో అమ్ముతున్నారు. వీటిని చూసిన నగర వాసులు కొనేందుకు ఆసక్తి చూపిస్తు న్నారు. రూ.80 నుంచి రూ.100ల వరకు వీటిని వ్యాపారులు అమ్ముతున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లకు ఏ మాత్రం తీసిపోకుండా ఈ మట్టి బాటిళ్ల ఉండటంతో నగర వాసులు ఆసక్తి చూపిస్తున్నారు.

● (ఆంధ్రజ్యోతి, నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

సమగ్ర వ్యవసాయంతో ఆదాయం ఫుల్

● సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పళ్లు ● ఓ వైపు ఆదాయం.. మరో వైపు ఆరోగ్యం

ఏర్గట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విభిన్న రకాల ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తూ సమగ్ర వ్యవసాయం చేసుకుంటున్న ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన ముత్తెన్న అనే రైతు అందిరితో భళా.. అనిపించుకుంటున్నాడు. చేపలు, కోళ్లు, పశువులు, కూరగాయలు అలాగే వాణిజ్య పంటలు అన్ని ఒకే దగ్గర చేయడాన్నే సమగ్ర వ్యవసాయం అంటారు. అందులో భాగంగానే మండల కేంద్రానికి చెందిన రైతు మత్తెన్న తనకున్న రెండు ఎకరాల్లో కోళ్లు, పశువులు, కూరగాయలు, చేపల పెంపంకం చేస్తూ ఆదాయాన్ని పెంచుకుంటున్నాడు. ఒకపుడు రైతుల ఇళ్లలో పాడి పంట కలిగి సందడిగా ఉండి సిరులు కురిపించేవి, కాలక్రమేనా పాడి రైతులకు దూరంగా వేరే పరిశ్రమగా మారింది. పని భారం, మేత కష్టాలు ఇతర కారణాల వల్ల పాడిని రైతులు దూరం చేసుకుంటూ వచ్చారు. ఒకప్పుడు సంవృద్ధిగా దొరికే పేడ/సేంద్రియ ఎరవుపైన ఈ రోజు ఎకరాకు 80 నుండి 90 వేల ఖర్చు చేయాల్సి వస్తోంది. అంత ఖర్చు చేసినా కొని సార్లు దొరకడం లేదు. ప్రత్యామ్నాయంగా మార్కెట్లో లభ్యమయ్యే రసాయన ఎరువుల వాడకం అధికం అయిపోయింది. దీంతో పంటలకు ఆశిస్తున్న చీడ పీడల యాజమాన్యం కోసం పెడుతున్న ఖర్చులు చాలా ఎక్కువయ్యాయి. ఈ సమగ్ర వ్యవసాయం వల్ల అన్ని ఒకే చోట ఉండటం వల్ల పాడి పంట లాభధాయకంగా ఉంటుందని, దాని వల్ల లాభాలకు లాభాలు మరోవైపు ఆరోగ్యాన్ని సాగిస్తున్నట్లు చెప్పారు.



దూడలతో రైతు ముత్తెన్న

సమగ్ర వ్యవసాయం వల్ల అనేక లాభాలు

● వైష్ణవ్, మండల వ్యవసాయాధికారి,ఏర్గట్ల



చిన్న సన్నకారు రైతులు సమగ్ర వ్యవసాయం చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉంటాయి. సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు, పళ్ళు పండించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. దీని వల్ల రైతుకు ప్రతీ రోజు పని లబిస్తుంది.

డీఎస్సీ 2008 అభ్యర్థులకు నియామక ఉత్తర్వుల అందజేత



నియామకపత్రం అందజేస్తున్న డీఈవో

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008 నియామకాలలో అర్హత సాధించి ఉద్యోగాలు పొందలేకపోయిన వారికి ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో అవకాశం ఇస్తామని ప్రకటించడంతో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లాలో 74 మందికి నియామక పత్రాలను అందజేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్సీ 2008లో డీఎస్సీ రాసి అర్హత పొందినప్పటికీ డీఎడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వగా, బీఈడీ అభ్యర్థులకు ఇవ్వలేదు. ఆ అభ్యర్థులు ప్రభుత్వాన్ని విన్నవించడంతో వారికి కాంట్రాక్టు పద్ధతిలో నెలకు రూ.31వేల 40 రూపాయల వేతనంతో పనిచేసేందుకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శనివారం సాయంత్రం డీఈవో కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీజీ హెచ్‌ఎంలు శంకర్, మధుసూదన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మొదటి బ్యాచ్ ఆపదమిత్ర వలంటీర్లకు ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న ఆపద మిత్ర వలంటీర్లు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడ అత్యవసర పరిస్థితుల్లో తక్షణం సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా ఆపదమిత్ర వలంటీర్లకు శిక్షణ అందిస్తుండగా వంద మందితో కూడిన మొదటి బ్యాచ్ శిక్షణ శనివారం పూర్తయ్యింది. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు వాటిని ఎలా ఎదుర్కొనాలనే అంశాలపై ఎంపిక చేసిన సుమారు 300 మంది కమ్యూనిటీ వలంటీర్లకు మూడు విడతలుగా ఆపదమిత్ర శిక్షణ అందిస్తున్నారు. మొదటి విడతగా వంద మందికి శిక్షణ పూర్తి చేసుకోగా జిల్లా కేంద్రంలోని న్యాక్ భవనంలో ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై వాలంటీర్లను అభినందించారు. జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో విధులు నిర్వర్తించే ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రతిచోట అందుబాటులో ఉండే అవకాశం లేనందున కమ్యూనిటీ వలంటీర్లకు శిక్షణ అందించడం జరు గుతుందన్నారు. విపత్తులు సంభవించిన సమయాల్లో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగకుండా ఎలా వ్యవహరించాలనే విషయంలో శిక్షణ అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాని ఆటోడ్రైవర్ల ఆందోళన

ఖిల్లా,ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తమ సమస్యలు పరిష్కరించాలని ఆటోడ్రైవర్లు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిఎన్టీఆర్ చౌరస్తా వద్దఆందోళన చేశారు. తెలంగాణా రాష్ట్ర ఆటోడ్రైవర్ల సంఘం పిలుపు మేరకు తాము ఆందోళన చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు సదుపాయం కల్పించిందన్నారు. దీంతో తాము ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి ప్రతి ఆటో డ్రైవర్‌కు ప్రతి నెల రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. కాని ఇంత వరకు ఆ హామీని అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆటోడ్రైవర్లకు గిరాకీ లేకపోయిందని, పైగా ఆర్టీవో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తమను పలు ఆంక్షలు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు గంగాధర్, పండరీకృష్ణ, సయ్యద్ రఫీ, ఇమ్రాన్‌ఖాన్, ఎస్‌కే.షబ్బీర్, ఫిరోజ్, శివ, షరీఫ్, గడ్డం గంగాధర్, శాద్దుల్ అబ్దుల్ జబ్బార్, విఠల్, గోపి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి

సిరికొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):పరీక్షలు అనగానే బయపడకూడదని లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమ పద్ధతిలో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని వ్యక్తిత్వ వికాస నిపుణులు నవనీత విద్యార్థులకు సూచించారు. సిరికొండ హైస్కూల్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ చదివేటప్పుడు పెట్టుకున్న గోల్‌ను మర్చిపోకుండా చదువుకోవాలని మీరు చదివే చదువుపై శ్రద్ధతో చదవాలని పరీక్షలు అంటే భయపడకూడదని ఆమె సూచించారు. తల్లిదండ్రుల లక్ష్యం నెరవేరాలంటే బాగా చదివి ర్యాంకులు సాధిస్తే తల్లిదండ్రులు ఎంతో సంబరపడిపోతారని అన్నారు. తల్లిదండ్రుల కలలు, బోధించే ఉపాధ్యాయుల పేర్లను నెరవేర్చడానికి బాగా చదవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవీందర్ రావు, ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందను కలిసిన బార్ అసోసియేషన్ న్యాయవాదులు

నిజామాబాద్ లీగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందను శనివారం బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. న్యాయమూర్తి నంద కుటుంబ సభ్యులతో షిర్డీ సాయిబాబా దర్శనానికి వెళ్తున్న సందర్భంగా నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆమెను బార్ ప్రతినిధి బృందం కలిశారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యురాలిగా, మధ్యవర్తిత్వం కౌన్సిల్‌గా ఎనలేని న్యాయసేవలు అందించారని అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్ తెలిపారు. ఆమెను కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, డిప్యూటి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఉదయకృష్ణ, మహమ్మద్ షాదుల్లా, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ప్రమోద్, గంగోని శుభం, విశ్వక్‌సేన్, బాలాజీ, సీనియర్ న్యాయవాది ఆశ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిశీల హమాలీ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):ఖమ్మంలో జరిగే తెలంగాణ ప్రగతిశీల హమాలీ, మిల్క్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాల్గవ సభను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గోడౌన్ రోడ్‌లో నాల్గవ మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 3లక్షలకు పైగా వివిధ రంగాల్లో హమాలీ, మిల్క్ కార్మికులు ఎగుమతి దిగుమతులు చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్‌లో సివిల్ సప్లై, గ్రానైట్, మార్బుల్, ప్రభుత్వ, ప్రైవేటు గోదాములలో, రైల్వే, ఆర్టీసీలలో హమాలీల పేరుతో పనులు చేస్తున్నారని అన్నారు. వీరికి ఇప్పటికీ ఎటువంటి చట్టబద్ధమైన హక్కులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు లేక శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి దాని ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కనీస వేతన జీవోలు సవరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి నేటి ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఖమ్మంలో వీటిపై సమీక్షించుకొని భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, కిషన్, మురళి, మోహన్, సాయన్న, అశోక్, సుమన్, గంగాధర్, లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ తండా సేవాలాల్ మహరాజ్ ఆలయంలో భోగ్‌బండార్ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



బెటాలియన్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు



సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి

మోస్రా,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి):మండలంలోని చేనెంబర్ తండాదుబ్బాతో పాటు చందూర్ మండలంలోని కారేగావ్, మేడిపల్లి తండాలలో శనివారం గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామ పెద్దలు తండా నాయక్‌లు సేవాలాల్ మహరాజ్ ఆలయంలో భోగ్ భండర్ పెట్టి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. అదే విధంగా మహిళలు, తండా పెద్దలు, యువతీ, యువకులు నృత్యం చేశారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి వర్ని మండల మాజీ ఏఎంసీ చైర్మన్ అంబర్ సింగ్, కారేగావ్ మాజీ సర్పంచ్ దేవుసింగ్, చేనెంబర్ తండా మాజీ సర్పంచ్ ధర్మనాయక్, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండలంలోని దేవుని గుట్ట తండాలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని జగాదాంబ ఆలయంలో పౌరదేవి ఆలయ శివ మహరాజ్ ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. గిరిజనులు జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సేవాలాల్ మహరాజ్ మార్గంలో నడవాలని శివ మహరాజ్ భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్:సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న గిరిజన జాతిని సన్మార్గంలో నడిపించిన గొప్ప మహానుభావుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఓం సింగ్, నరేందర్, సరిచంద్, జగత్‌సింగ్, నాగరాజు, కిశోర్, పద్మారెడ్డి, రాజన్న, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని మౌలాలి తండా, వీరన్నగుట్ట తండా, కిసాన్ తండా గ్రామాలలో శనివారం బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రయాణించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు గోవింద్, అశోక్, శ్రావణ్, రవి, శ్రీకాంత్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:బాల్కొండ నియోజిక వర్గంలోని స్కూల్ తాండాలో కొలువు దీరిన గిరిజనుల ఆరాధ్య దైవం,బంజారాల విశ్వగురువు సంత్ సేవాలాల్ మహరాజ్ 286 వ జయంతిని బాజారా సేవాసంఘాల అధ్వర్యంలో శనివారం అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగ జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలకు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు హజరై ఆలయంముందు ఏర్పాటు చేసిన భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు సేవాలాల్ మహరాజ్ ప్రవచనాలు ముఖ్యంగా బంజార సమాజానికి ఒక దీక్సుచిగా నిలుస్తాయని కొనియాడారు. ధర్మంచ నైతికత మానవత్వం సమాజసేవాలాంటి ఆయన బోదనలను ప్రతీఒక్కరు ఆచరిస్తు ఆయన బాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో మానాల మాజీ సర్పంచ్ విశ్రాంత మూడు జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి మాల్వోత్ నరహరి నాయక్, లక్ష్మణ్ నాయక్, బీఆర్ఎస్ నాయకుడు రాజాగౌడ్, బీఆర్ఎస్ రుద్రంగి మండల పార్టీ అద్యక్షుడు దెగావత్ తిరుపతి, నయకులు భూమా నాయక్, నరేష్ నాయక్, 8 గ్రామపంచాయితీలకు చెందిన 16 గిరిజన తాండాల ప్రజలునాయకులు పాల్గొన్నారు.

● అమీర్‌నగర్ బిల్యానాయక్ తాండాలో

కమ్మర్‌పల్లి మండలంలోని అమీర్‌నగర్ బిల్యానాయక్ తాండాలో శనివారం గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ 286 జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ ప్రకాశ్ నాయక్, తాండావాసులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో శనివారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో భోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. మండలంలోని రాజీవ్ నగర్ తండా, తదితర గ్రామాలలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను నిర్వహించారు.

సుభాష్‌నగర్:సేవాలాల్ మహరాజ్ గిరిజనులకే కాకుండా సమాజంలో అందరికి ఆదర్శనీయుడని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి సందర్భంగా నగరంలోని వినాయక్‌నగర్‌లోగల ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ సందేశాలు, బోధనలు, సూచనలు నేటికి అందరికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, పలువురు నాయకులు ఉన్నారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం 7వ బెటాలియన్‌లో సేవాలాల్ మహరాజ్ ఆలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేసి భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని వేడుకలను నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ జలపతి, జిల్లా ఎస్సీ, ఎస్టీ తెలంగాణ గజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పరశురాంలు, జిల్లా అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ, లెక్చరర్‌లు పాల్గొన్నారు.



మోస్రా మండలం చే నెంబర్ తండాదుబ్బాలో నృత్యం చేస్తున్న దృశ్యం



మౌలాలి తండాలో

ఘనంగా నిశిత ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

● నృత్యాలతో సందడి చేసిన విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):నగరంలోని అమ్మ వెంచర్‌లోగల నిశిత ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. చిట్టిపొట్టి చిన్నారులు తమ బుజ్జి బుజ్జి ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమానికి భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రమాదేవి ముఖ్య అతిథిగా హాజరుకాగా, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సాయిలు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా చిన్నారులు చేసిన డ్యాన్సులు, నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నిఖిల్, చీఫ్ ప్యాట్రన్ వినయ్, డైరెక్టర్ పూజా, కోఆర్డినేటర్ రాజు, ప్రిన్సి పల్ రమీందర్‌కౌర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీయూ పరిధిలోని ఎంఎడ్ పరీక్ష షెడ్యూల్ విడుదల

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎంఎడ్ మూడవ సెమిస్టర్ రెగ్యూలర్ థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 4వరకు జరుగుతాయని పరీక్షల నియంత్రణ అధికారిని ఆచార్య ఎం. అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలను టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె పేర్కొన్నారు.

ప్రారంభమైన అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు

మోపాల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఉన్న అనంతపద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. అనంతగిరి గ్రామం నుండి మల్కాపూర్ అనంత పద్మనాభ స్వామి ఆలయం వరకు శనివారం ఉదయం స్వామివారిని పల్లకీ సేవలో ఊరేగింపుగా గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు, గ్రామస్తులు తీసుకువచ్చారు. ప్రతీ సంవత్సరం బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు వారం రోజుల పాటు ఘనంగా జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీరోజు స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లను చేశారు.

వాహనాలకు స్టిక్కర్లు అతికించిన విద్యార్థులు

సిరికొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మోడల్ స్కూల్ విద్యార్థులు తెలంగాణ చౌరస్తాలో వాహనాలను ఆపి రేడియం స్టిక్కర్లను అతికించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అతి వేగం ప్రమాదం అని గ్రహించాలని వారు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవీందర్‌రావు, ప్రిన్సిపల్ రాజేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూలిన జడ్పీహెచ్‌ఎస్ ప్రహరీ

మోపాల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మోపాల్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రహరిగోడ కూలిపోయిన పట్టించుకునే వారు కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రహరిగోడ కూలిపోవడంతో పాములు, విష పురుగులు పాఠశాలల్లోకి ప్రవేశిస్తున్నాయని విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కూలిపోయిన ప్రహరిగోడను వెంటనే మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

ఘనంగా షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న భక్తవత్సలం

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలను శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశవేణు ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలు రెడ్ క్రాస్ సొసైటీకి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ హాజరయ్యా రు. షబ్బీర్ అలీ మంత్రిగా, ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయ కులు రత్నా కర్, జావిద్‌అక్రమ్, రాంభూపాల్, వేణురాజ్, మీసాల సుధాకర్‌రావుపాల్గొన్నారు.

● విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని దుబ్బ పాఠశాలలో పదోతరగతి విద్యా ర్థులకు బాపూజీ వచనాలయ అధ్యక్షుడు భక్తవత్సలం, కార్యదర్శి మీసాల సుధాకర్‌రావు, పెంట దత్తాద్రి, లక్కంరెడ్డి తదితరులు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా నగరంలోని అభయహస్తం కాలనీలో నిరుపేదలకు నాయకుడు మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో దుప్పట్లు,చిన్నపిల్లలకు స్వెటర్లు పంపిణీ చేశారు.

పిల్లల ఎదుటే భార్యను గొంతు నులిపి హత్య చేసిన భర్త

● మద్యానికి బానిసై డబ్బుల కోసం అఘాయిత్యం

● నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో ఘటన



అనూష(ఫైల్)



రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్పల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఎదుటే భార్యను గొంతు నులిపి హత్య చేసిన సంఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో జరిగింది. అనాథలైన పిల్లలతో మృతురాలి కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన లోలం అనూష వేల్పూర్ మండలం జాన్కంపేట్‌కు చెందిన వినోద్ 12ఏళ్ల క్రితం ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నారు. అయితే వినోద్‌కు గతంలోనే వివాహం జరిగింది. వినోద్, అనూషలకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్ది రోజులుగా వినోద్ ధర్పల్లి మండల కేంద్రంలోని భార్య అనూష వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస అయిన వినోద్ భార్య అనూషను డబ్బులు డిమాండ్ చేశాడు. సుమారు రూ.5లక్షల మేర అప్పు తెచ్చి వినోద్‌కు ఇచ్చినట్లు తెలిసింది. అయినప్పటికీ భార్య భర్తల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగగా తన పిల్లల ఎదుటే వినోద్ అనూషను గొంతు నులిమి హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హత్యను ఆత్మహత్యగా పోలీసులు చిత్రీకరించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. కాగా, వినోద్ పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది. అనూష పిల్లలకు న్యాయం చేయాలని హత్య చేసిన భర్తను వెంటనే పోలీసులు పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు శనివారం రాత్రి మండల కేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. శవాన్ని పోస్టుమార్టం పంపిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 250



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.88300	రూ.81500	రూ.995

సినిమా గైడ్ నిజామాబాద్




పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1: కెప్టెన్ అమెరికా(తెలుగు3డి)(10.45, 7.20)
: లైలా (1.25) : తండేల్ (4.15, 10.00)
స్క్రీన్-2:చావా (హిందీ)(10.00, 4.00, 10.25)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (1.20)
: తండేల్ (7.20)
స్క్రీన్-3 : తండేల్ (10.30)
: నిదిరించు జహాపనా (1.35)
: లైలా (4.10): చావా (హిందీ) (7.00)
: సనం తేరీ కసమ్ (హిందీ) (10.20)
స్క్రీన్-4 : తాలా (10.55)
: సంక్రాంతికి వస్తున్నాం (1.35, 7.40)
: బ్రహ్మ ఆనందం (4.35) : లైలా (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1:చావా (హిందీ) (11.00, 1.40, 10.20)
: తండేల్ (4.35, 7.30)
స్క్రీన్-2 : లైలా (11.00, 1.40, 7.20, 10.20)
: చావా (హిందీ) (4.30)
స్క్రీన్-3 : బ్రహ్మ ఆనందం (11.00, 4.30)
: ఆరేంజ్ (1.40)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (7.40)
: తండేల్ (10.25)

దేవి: లైలా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : చావా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)



- నిజామాబాద్ అర్బన్